
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 జూన్ 2023



రేపు టెన్త్ టాపర్లకు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల పరిధిలో పది టాపర్లుగా నిలిచిన విద్యార్థులను జన విజ్ఞాన వేదిక ఘనంగా సత్కరించి ప్రోత్సాహకాలు అందించనుందని జేవీవీ జిల్లా నాయకులు ఎస్ఎం. షరీఫ్, బి.చెంచయ్య శుక్రవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీన శ్రీకాళహస్తి బాలికల ఉన్నత పాఠశాల వేదికగా ఉదయం 9 గంటలకు టెన్త్ టాపర్ల సన్మాన సభ ఉంటుందని పేర్కొన్నారు. పదిలో సత్తా చాటిన విద్యార్థులకు మెమెంటో, ప్రశంసా పత్రం సైన్స్ బుక్ ను బాహూకరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేరెర్ గైడెన్స్ పై పది విద్యార్థులకు జేవీవీ ఆధ్వర్యంలో అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై సన్మాన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైసిపి కార్మిక ద్రోహి : అఖిలపక్ష కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కార్మిక ద్రోహి అయిన వైసిపిని గద్దె దించడమే తెలుగునాడు ట్రేడ్ యూనియన్ ధ్యేయమని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు రఘురామరాజు అన్నారు. పద్మావతిపురంలోని ఎల్‌వి కల్యాణ మండపంలో టిడిపి కార్మిక విభాగమైన తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. రఘురామరాజు మాట్లాడుతూ వైసిపి అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరాలలో సమావేశాలు ఏర్పాటు చేసి కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెస్తామన్నారు. జగన్మోహన్‌రెడ్డి కార్మికులకు చేస్తున్న అన్యాయంపై టిఎన్‌టియుసి అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఎంఎల్‌సి దువ్వారపు రామారావు మాట్లాడుతూ నాలుగేళ్లుగా కార్మికులపై జగన్మోహన్‌రెడ్డి దమనకాండ సాగిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ మాట్లాడుతూ 1982 నుంచి ఇప్పటివరకూ కార్మికులకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. టిడిపి తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు 40 లక్షల మంది, రవాణారంగంలో 12 లక్షలు, ఆర్టీసీలో 50వేలు, విద్యుత్ రంగంలో 40వేల మంది ఉన్నారని, వీరందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్‌కోడ్‌లను తీసుకొస్తే, దాన్ని నిరసన తెలియజేసింది వామపక్ష ట్రేడ్ యూనియన్లేనన్నారు. టిఎన్‌టియుసి కార్మికుల మెడపై కత్తిలా జీవో తీసుకొస్తే పోరాడకపోగా ఇంటికే పరిమితమయ్యిందని విమర్శించారు. ఇప్పటికైనా టిఎన్‌టియుసి మేల్కొన్నందుకు స్వాగతిస్తున్నామన్నారు. బిజెపితో టిడిపి దూరంగా ఉంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని, ఆ దిశగా కార్మికులు పోరాడాలన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాక్రిష్ణ, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి రత్నకుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంబూరు సింధూజ, టి.సత్యనారాయణ, టిఎన్‌టియుసి గౌరవాధ్యక్షులు శేషగిరిరావు, జయరామిరెడ్డి, మాధవనాయుడు పాల్గొన్నారు.



సమస్యలపై కార్మికులను ఏకతాటిపైకి తీసుకురావాలంటున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

'అమరా'లో పురిటిబిడ్డకు అరుదైన చికిత్స : సిఎఒ

ప్రజాశక్తి - రేణిగుంట

అత్యాధునిక వైద్య సదుపాయాలతో అరుదైన చికిత్సలు 'అమర'లోనే సాధ్యమని హాస్పిటల్ సీఏఓ వేణుగోపాల్ స్పష్టం చేశారు. శుక్రవారం రేణిగుంట మండలంలోని కరకంబాడి సమీపంలో గల అమర హాస్పిటల్ నందు పురిటి బిడ్డకు అరుదైన చికిత్సను అందించి విజయవంతంగా డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా అమర ఆసుపత్రి సీఏఓ వేణుగోపాల్ మాట్లాడుతూ పురిటి బిడ్డ బేబీ ఆఫ్ నర్మదా పుట్టుకతోనే కేవలం 1000 గ్రాములతో జన్మించిందన్నారు. పుట్టిన బిడ్డ తీవ్రమైన అనారోగ్యంతో శ్వాస కూడా తీసుకోలేని పరిస్థితిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్స్ తో అమర హాస్పిటల్ నందు అడ్మిట్ చేసినట్లు తెలిపారు. అమర హాస్పిటల్ లో శిశు సంరక్షణ డిపార్ట్మెంట్ స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ కిషోర్ టీం వెంటనే స్పందించి అడ్వాన్స్డ్ లెవెల్ 3 ఎన్ ఐ సి యు కేర్ అందించి ఆ చిన్న బాబుకు న్యూరోలాజికల్ సమస్యలు రాకుండా పూర్తి ఆరోగ్యంతో 55 రోజులకు 2 కేజీల 300 గ్రాములతో డిశ్చార్జ్ చేసినట్లు ఆనందం వ్యక్తం చేశారు. తమ బిడ్డ ప్రాణాలతో చూడలేము అనుకున్న తల్లిదండ్రులు వాళ్ల బిడ్డను పూర్తి ఆరోగ్యంతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా డిశ్చార్జ్ చేసినందుకు అమర హాస్పిటల్ యాజమాన్యానికి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్‌కు కతజ్ఞతలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో అమర హాస్పిటల్ వైద్య బందం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



బేబీని ఆరోగ్యంగా తల్లిదండ్రులకు అందిస్తున్న వైద్యులు

అనాథ శవాల తరలింపునకు వాహనమివ్వండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో గుంతలు పడిన తారు రోడ్లకు ప్యాచ్ వర్క్సు చేసేందుకు ఒక వాహనాన్ని, అలాగే నగరంలో మృతిచెందిన అనాధ శవాల తరలింపుకు మరో వాహనాన్ని ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ హరితకు డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ వినతిపత్రం సమర్పించారు. తారు రోడ్లు ప్యాచ్‌లకు సంబంధించి ఇప్పటివరకూ తోపుడుబండ్లు ఉపయోగిస్తున్నారని, పనులు తొందరగా జరిగేందుకు, తారు, ఇసుక, గుల్ల సామాగ్రి తీసుకుని వెళ్లుటకు కొత్త వాహనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ హరిత స్పందిస్తూ వాహనాల ఏర్పాటు పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు.

8న జమ్మూలో శ్రీవారి ఆలయానికి సంప్రోక్షణ

తిరుమల : జమ్మూకశ్మీర్‌లో జూన్ 8వ తేదీన శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయ సంప్రోక్షణ ఉంటుందని టిటిడి వెల్లడించింది. జూన్ 3న శ్రీవారి ఆలయంలో వైదిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపింది. జమ్మూకశ్మీర్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని టిటిడి నిర్మించిన విషయం తెలిసిందే. వైఖానస ఆగమోక్తంగా, సర్వాంగ సుందరంగా ఈ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. మాతా వైష్ణోదేవి దర్శనం కోసం జమ్మూ వచ్చే భక్తులకు శ్రీవారి ఆలయ సందర్శనం ఎనలేని ఆధ్యాత్మిక అనుభూతిని ఇవ్వనుందని టిటిడి అధికారులు తెలిపారు.



ఎక్స్‌ప్రెస్ రైల్ మేనేజర్ ఎంవి రమణ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఎక్స్‌ప్రెస్ రైల్ మేనేజర్ ఎంవి రమణ ఉద్యోగ విరమణ చేశారు. రైల్వే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై 1980లో రేణిగుంటలో 12 సంవత్సరాలు గార్డుగా విధులు నిర్వహిస్తూ వచ్చారు. రేణిగుంట, తిరుపతి కేంద్రాలుగా 36 సంవత్సరాలు గార్డుగా పనిచేస్తూ ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘంలో చేరి ఉద్యోగులకు చేదోదువాదోడుగా అనేకమందికి సేవలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ ఉద్యోగులను ప్రోత్సహించే అవార్డుల్లో డిఆర్‌ఎం అవార్డు, సేఫ్టీ అవార్డులను ఉన్నత అధికారులు చేతుల మీదుగా అందుకున్నారు. ఎంవి రమణ కొడుకు కెనడాలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బాధ్యతతో ఒక క్రమశిక్షణగా విధులను నిర్వహిస్తున్నందుకు పలువురు అధికారులు అభినందించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంవి రమణ మాట్లాడుతూ రైల్వే శాఖ తో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకుని జ్ఞాపకాలను తెలియజేశారు. యం. వి. రమణ, ఎక్స్‌ప్రెస్ రైలు మేనేజర్ పదవి విరమణ సందర్భంగా తిరుపతి రైల్వే స్టేషన్ లో విఐపి లాంచ్ లో పదవి విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పల సత్యనారాయణ, ప్రభాకర్, రైల్వే ఎంప్లాయిస్ సంఘం గుంతకల్ డివిజన్ కార్యదర్శి, కెబిఎస్ రాజు, సంఘ్ తిరుపతి శాఖ ప్రధాన కార్యదర్శి, ఎంప్లాయిస్ సంఘ తిరుపతి శాఖ చైర్మన్ హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.



మ్యుటేషన్ దరఖాస్తులపై దృష్టి సారించాలి : జేసీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

మ్యుటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను ఆలస్యం లేకుండా గడువులోపు పరిష్కారం చూపేల దష్టిసారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్డిఓలు, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్ఓలతో రీసర్వే, విలేజ్ సర్వేర్ ల డేటా ఎంట్రీ, జగనన్నకు చెబుదాం, మ్యూటేషన్, అసైన్ మెంట్ ల్యాండ్స్, కోర్టు కేసెస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత అంశం కాబట్టి అర్జీలను సంతప్తి స్థాయిలో పరిష్కారం చూపేలా ఉండాలని, జిల్లాలో పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ సంబంధించిన దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలన్నారు. గ్రామాలలో విలేజ్ సర్వేల డేటా, ఎంట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించే దిశగా సదా బైనామ ద్వారా వచ్చిన అప్లికేషన్స్ పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. అసైన్మెంట్ ల్యాండ్స్ కు సంబంధించిన ఫైల్స్, కోర్టు కేసెస్ కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కోదండరామి రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఏడి. సర్వేయర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రణాళికలు : ఈవో

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి తో పాటు వివిధ శాఖల అధికారులు, టీటీడీ అధికారులతో ఈవో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇవీ

- డౌన్ ఘాట్ రోడ్డులో 1వ మలుపు, 7వ మైల్, అలిపిరి డౌన్ గేట్, అప్ ఘాట్ రోడ్డులో లింక్ రోడ్డు, సహజ సిద్ధంగా ఏర్పడిన ఆర్చి(గరుడ ఆకారం), దివ్యారామం ప్రాంతాల్లో చెక్ పాయింట్స్ ఏర్పాటు చేయాలి.
- అప్ ఘాట్ రోడ్డులోలా డౌన్ ఘాట్ రోడ్డులోనూ కాంక్రీట్ రీటైనింగ్ వాల్స్ నిర్మించాలి.
- ఏ రకమైన వాహనాలను ఘాట్ రోడ్డులో నిషేధించవచ్చో ప్రణాళికలు సిద్ధం చేయాలి.
- ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను విరివిగా ఏర్పాటు చేయాలి.
- ఘాట్ రోడ్లలో స్పీడ్ లిమిట్ ఎంత? డ్రైవింగ్ చేసేప్పుడు మొబైల్ వాడకంపై నిషేధం, తీసుకోవాల్సిన ఇతర జాగ్రత్తలు తెలిపేలా నిరంతరం కర పత్రాలు పంపిణీ చేయాలి.
- ఘాట్ రోడ్లలో వాహనాల వేగాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవడానికి స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలి
- అంబులెన్స్‌లు , రెస్క్యూ టీమ్ లు అవసరమైన పరికరాలతో సదా సన్నద్ధంగా ఉండాలి.
- ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ బస్సుల్లో ఆడియో టేపు లు వినిపించే ఏర్పాటు చేయాలి.



- తిరుమలలో ఉచిత బస్సుల సంఖ్య పెంచాలి
- ఘాట్ రోడ్లలో ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ఓవర్ టేక్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.
- ఘాట్ రోడ్లలో ప్రమాదాలు జరిగిన తక్షణమే రుయాతో పాటు స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

ఈ సమావేశంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివి ఎస్వో నరసింహ కిషోర్, ఎఫ్ఎసిఏవో బాలాజి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, టీటీడీ ఇంజినీరింగ్ సలహాదారు రామచంద్రారెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ , బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి , రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు , అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆర్టీసీ ఆర్‌ఎం చెంగల్ రెడ్డి, ఇంచార్జ్ ఆర్టీవో రవీంద్ర నాథ్ పాల్గొన్నారు.

వేసవి కరాటే తరగతులు విజయవంతం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గత మే ఒకటి నుండి 31వ తేదీ వరకు నిర్వహించిన వేసవి కరాటే తరగతులు విజయవంతమయ్యాయని చిత్తూరు జిల్లా కరాటే చీఫ్ ఇన్స్‌ఫెక్టర్ కెఎస్.ముస్తఫా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కరాటే తరగతులకు ఎంతో ఉత్సాహంగా పిల్లలు హాజరయ్యారని, ప్రతిభ కనబరిచిన వారికి డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.సాహిబ్ హాజరై ప్రశంసా పత్రాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు ప్రవీణ్, ఉదయ్, ఇర్ఫాన్, సురేష్, రాజేష్ పాల్గొన్నారన్నారు.



శ్రీవారి సేవలో జవహర్‌రెడ్డి

తిరుమల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో ఆయనకు వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం హృదయాలయ, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రులను పరిశీలించారు.



ఘనంగా జ్యేష్ఠాభిషేకం ప్రారంభం

తిరుమల: శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న జ్యేష్ఠాభిషేకం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణమండపంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో వేదపండితులు శ్రీసూక్తం, భూసూక్తం, పురుష సూక్తం, నీలా సూక్తం, నారాయణసూక్తాలను పఠిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరిస్తారు. సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి ఉత్సవమూర్తులు వజ్రకవచంతో ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ముత్యపుకవచంతో, ఆదివారం స్వర్ణకవచంతో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో ఈవో ఏవి ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.





కొండెక్కిన 'కోడి'

- కిలో రూ.300 లకు చేరువలో...
- పేదలకు భారంగా 'చికెన్'



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

'మటన్ కిలో 800 పలుకుతుంటే, చికెన్ కిలో రూ.300 అయితే ఏమి ఇబ్బంది' అని ఓ సాధారణ కాంట్రాక్టు కార్మికుని అడిగితే అతని నుంచి వచ్చిన సమాధానం 'నా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం.. మటన్ కొనాలనే ఆలోచన కూడా నాకు రాదు.. అంతోఇంతో నెలలో రెండు మూడుసార్లు చికెన్ తెచ్చుకుంటాం.. గతంలో కిలో రూ.180 ఉన్న ధర ప్రస్తుతం ఏకంగా రూ.300కు చేరువలో ఉంది..' అని వాపోయాడు.

బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో రవాణా ఛార్జీలు అంతకంతకు పెరిగి నిత్యావసర సరుకులపై ఈ ప్రభావం పడింది. నిత్యావసర సరుకులు ఖచ్చితంగా కొనాల్సి రావడంతో ఎలాగోలా తంటాలు పడి సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొంటున్నారు. వారంలో ఒకరోజైనా తన కుటుంబంతో కలిసి మాంసాహార భోజనం చేయాలనే కోరిక ప్రస్తుతం లేకుండా పోతోంది. పొట్టేలు మాంసం ధర కేజీ 750-800 రూపాయలు పలుకుతోంది. కనీసం కోడి మాంసంతో సరిపెట్టుకుందాం అనుకుంటే ఆ కోడి కూడా కొండెక్కి కూర్చుంది.

పొట్టేలు మాంసం ధరలతో పోల్చుకుంటే చికెన్ ధర నాలుగో వంతు ఉండటంతో ప్రతి పేదవారు చికెన్ మీదే ఆసక్తి చూపుతుంటారు. కానీ వారి ఆశల మీద నీరు చల్లే విధంగా చికెన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గత పది రోజుల క్రితం 180 రూపాయలు విక్రయిస్తున్న చికెన్ ప్రస్తుతం 280 రూపాయల నుంచి 300 వరకు పెరగటంతో పేద మధ్యతరగతి వారు బెంబేలెత్తిపోతున్నారు. బాయిలర్ చికెన్ ఒక కేజీ 280, స్కిన్లెస్ 320, బోన్లెస్ 350 రూపాయల వరకు దుకాణదారులు విక్రయిస్తున్నారు.

మామూలుగా ఎండాకాలం వచ్చిందంటే చికెన్ కోడిగుడ్లు ధరలు బాగా తగ్గి పేద మధ్యతరగతి వారికి ధరలు అందుబాటులో ఉంటాయి. కానీ ఈ సంవత్సరం అందుకు విరుద్ధంగా ఎండలు ఎక్కువ కావడంతో కోళ్ల ఫారాల్లో కోళ్లు ఎక్కువ శాతం మత్యువాత పడటంతో కోళ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గి చికెన, కోడిగుడ్లు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని చికెన్ దుకాణదారుల చెబుతున్న సమాధానం. అలాగే చికెన్ ధరలు పెరగడంతో పేద మధ్యతరగతి ప్రజలు దుకాణాల వైపు కన్నెత్తి చూడటమే మానేశారని అంటున్నారు. పెట్టుబడులు గణనీయంగా పెరగడంతో ఆర్థికంగా నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన చెందుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి : సామాన్యుడు

ఎండలు పెరిగాయనో, కోళ్లు చనిపోతున్నాయనో ఏదో ఒక సాకుతో దుకాణాదారులు అంతా ఏకమై పేద, మధ్యతరగతి వారి జేబులు కొల్లగొడుతున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చికెన్ దుకాణాల మీద దష్టి సారించి పేద మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



మోడల్ స్కూల్‌కు హద్దులు చూపాలని వినతి



ప్రజాశక్తి-కేవీబీపురం: కేవీబీపురంలోని సమస్యలు పరిష్కరించాలని.. మోడల్ స్కూల్ హద్దులు చూపాలని తహశీల్దారు చంద్రశేఖర్‌కు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు మాట్లాడుతూ తూర్పు మండలాల్లో ఏకైక పాఠశాలగా ఏపీ మోడల్ స్కూల్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్నత విలువలతో కూడిన బోధన జరుగుతున్నప్పటికీ ప్రతి సంవత్సరం పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలకు స్థలం లేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే తహశీల్దారు స్పందించి మోడల్ స్కూల్ స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని సర్వేయర్‌కు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో భూ సమస్యలు జఠిలంగా ఉన్నాయని.. సదరు సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కొత్తూరులో పేదలకు ఇంటి స్థలాల సమస్య ఉన్నప్పటికీ వీఆర్వో అలసత్వంతో నేటికీ పంపిణీకి నోసుకోకపోవడం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తహశీల్దారు దష్టికి తీసుకెళ్లారు. తక్షణమే సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

నిమ్మ మొక్కల తొలగింపు



ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని రామాపురం గ్రామంలోని సర్వే నెంబరు 177లోని మేతబీడు పొరంబోకు ప్రభుత్వ భూముల్లో అదే గ్రామానికి చెందిన 11 మంది నిమ్మ మొక్కలు బుధవారం నాటారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు గురువారం వెళ్లి నిమ్మ మొక్కలు తొలగించారు. దీంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలోని వీఆర్వో మేకలయ్యను బాధిత మహిళలు ముట్టడించారు. మేతబీడు పొరంబోకు సాగులో లేదని..ఏడాది నుంచి తాను గ్రామానికి వీఆర్వోగా ఉన్నానని సూచించారు. ప్రభుత్వ భూముల్లో చేయరాదని చెప్పడంతో మహిళలు, వీఆర్వో మధ్య వాగ్వాదం జరిగింది.

చిన్నారులకు పాదరక్షలు పంపిణీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని బాలసదన్ లో సాయి కష్టారెడ్డి తల్లి పుట్టినరోజు సందర్భంగా చిన్నారుల నడుమ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం చిన్నారులకు పాదరక్షలు, వివిధ రకాల తినుబండారాలు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలసదన్‌లో ఆర్‌వో ప్లాంట్, ఛాయిస్ ఫుడ్ వంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ దశరధరామిరెడ్డి, కష్ణయ్య , రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రూపేష్ కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి- తొట్టంబేడు: పొయ్య పంచాయతీ గురుకులపాలెం దళితవాడకు చెందిన కట్టా శ్రీరాములు, సక్కమ్మల కుమారుడు రూపేష్ గత కొద్ది రోజులక్రితం సింగమాల వద్ద తెలుగు గంగ కాలువలో ఈతకు వెళ్లి గల్లంతు అయిన రూపేష్ కుటుంబానికి తొట్టంబేడు మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, వైసీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు దంపతులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. రూపేష్ కాలువలో గల్లంతై మతదేహం కనిపించకపోవడంతో కడచూపునకు నోచుకోలేక పోయామని తల్లి సక్కమ్మ బోరున విలపించింది. మండల కన్వీనర్ వాసుదేవ నాయుడు ఆమెను ఓదార్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు తుమ్మూరు మోహన్, కన్నలి లీలాప్రసాద్, క్రాంతి కుమార్, చంద్ర పాల్గొన్నారు.

రేణుకామాతను దర్శించుకున్న పవిత్రారెడ్డి



ప్రజాశక్తి- తొట్టంబేడు: మండలంలోని శేషంనాయుడుకండ్రిగ అరుంధతి వాడలో రేణుకామాత పరమేశ్వరి ఆలయంలో గోపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కుమార్తె పవిత్రరెడ్డి హాజరయ్యారు. అనంతరం సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా సమస్య ఉంటే ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి దష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ్ నాయుడు, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ గురుస్వామి నాయుడు, దీపక్ రెడ్డి, నరసింహ నాయుడు, కొన్నలి రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగమణి, రామకష్ణ రెడ్డి, వెంగల్ రావ్, ప్రభాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వకుళ మాత ఆలయ వార్షికోత్సవ పోస్టర్ విడుదల



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: పేరూరు సమీపంలోని శ్రీ వకుళ మాత ఆలయ మొదటి వార్షికోత్సవ పోస్టర్‌ను టీటీడీ పరిపాలన భవనంలో జేఈవో వీరబ్రహ్మం శుక్రవారం విడుదల చేశారు. జూన్ 13వ తేదీ వార్షికోత్సవం జరుగనుంది. ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మితో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన బతుకులు భారం

- రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి
- కొండ ప్రాంతాల్లో జీవనం
- సదుపాయాలూ శూన్యం
- బడికి రావాలంటే 3 కిలోమీటర్లు నడక
- అధికారుల చర్యలు అంతంతమాత్రం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ



స్వాతంత్ర్యం వచ్చి సంవత్సరాలు గడిచినా గిరిజన బతుకుల్లో నేటికీ వెలుగులు లేకపోవడం గమనార్హం. రెక్కాడితేగాని డొక్కాడని గిరిజనులు రోజు ఏదో ఒక కూలి పనికి పోతేనే కడుపు నిండుతుంది. పౌష్టికాహార లోపంతోనూ పిల్లలు పెరుగుదలలో మార్పులున్నాయి. చదువుకోవాలన్నా 3 కిలోమీటర్లు నడిచివెళ్లి పాఠశాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొనడం గమనార్హం.

బుచ్చినాయుడుకండ్రిగ మండలం కల్లివెట్టు గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో పచ్చని చెట్లు.. ప్రకతి అందాల కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలోని గాంధీ కాలనీ, మొక్కలచేను గ్రామాల్లోని గిరిజనులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. గాంధీ కాలనీలో సుమారు 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ ప్రాంతాల్లోని గిరిజనుల ఆర్థిక పరిస్థితులు అగమ్యగోచరంగా ఉంటున్నాయి. పగలంతా ఎండనకా, వాననకా కష్టపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రోజూ కష్టపడి సంపాదించి ఆ రోజు పూట గడుపుతున్నారు. ఎక్కువగా పూరి గుడిసెల్లోనే జీవనం సాగిస్తూ అడవిని నమ్ముకుని జీవిస్తున్నారు.


చదువులకు దూరం

ప్రస్తుతం ఈ కాలనీలో ఒకటి నుంచి ఐదో తగరతి వరకు చదువుకోవడానికి ప్రాథమిక పాఠశాల సైతం ఉంది. ఆరో తరగతిలో చేరి చదువులు కొనసాగించాలంటే 3 కిలో మీటర్లు నడిచి వెళ్లాల్సిన దుస్థితి. దీంతో గ్రామంలోని గిరిజనులు బడికి దూరం అవుతున్నారు. ఇది గమనించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు వారి సొంత నిధులతో ఆటో సౌకర్యం కల్పించినా ఫలితం అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, దాసు ప్రత్యేకంగా బడి బయట పిల్లల కోసం ఈ గిరిజన గ్రామాలను సందర్శించి పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు, అక్కడ గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. చదువు విలువను తెలియజేస్తూ పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే ఆయుధం చదువు ఒక్కటేనని వారికి తెలుపుతున్నారు. బడిఈడు పిల్లలు, బడికి వస్తూ మధ్యలో నిలిచిపోయిన పిల్లల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి బతుకుల్లో వెలుగులు నింపే దిశగా కృషి చేస్తున్నారు.

గిరిజనులకు సాయంగా లోకా ఫౌండేషన్

ఇదే గ్రామంలో గంగరాజు, వెంకటేష్ అనే ఇద్దరు యువకులు డిగ్రీ, డీఎడ్ చేసి అక్కడే ఉండిపోవడం గమనార్హం. వారు సైతం మార్పు దిశగా ప్రయత్నించినా మారని గిరిజనుల బతుకులకు స్థానిక లోకా ఫౌండేషన్ దత్తత తీసుకొని నేడు గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి నడుం బిగించారు. లోకా ఫౌండేషన్ వారు ఆ కాలనీ రూపురేఖలు మారుస్తూ కాలనీవాసులకు చేదోడు వాదోడుగా వాళ్ల వెంటే ఉంటూ లోకా ఫౌండేషన్ వారు ఆ కుటుంబ సభ్యులలో ఒకరిలా ఉండి వారి బాగోగులు చూసుకోవడం చాలా గొప్పతనం. ఇలాంటి కాలనీలకు ప్రభుత్వం చొరవ తీసుకొని వారిని మార్చే విధంగా కొన్ని టీములు ఏర్పాటు చేసి వారిని, పిల్లల చదువులను అభివృద్ధి పరిస్తే మండలంలోని ప్రతిఒక్క గిరిజన కాలనీలు బాగుపడతాయని పలవురు అభిప్రాయ పడుతున్నారు. ఇదే గిరిజన కాలనీలో ఎంపీపీలు, సర్పంచులు ప్రస్తుతం అధికారంలో ఉన్నారు. వారు చొరవ తీసుకుని గిరిజన కాలనీలను దత్తత తీసుకుని అభివద్ధి పథంలో నడిపించాలని.. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ నాయకులు మండల స్థాయి ఉన్నత అధికారులు ఈ గిరిజన కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు.

మొబైల్ దుకాణం యజమాని ఆత్మహత్య



ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని ప్రముఖ మొబైల్ షాప్ యజమాని శ్రావణ్ తూకివాకం చెరువులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గాజులమండ్యం ఎస్సై ధర్మారెడ్డి తెలిపారు. రేణిగుంట పట్టణంలో శ్రావణ్ మొబైల్ షాప్ నిర్వహిస్తూ షేర్ మార్కెటింగ్ బిజినెస్ సైతం చేసేవాడు. శ్రావణ్ ప్రేమ వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలున్నారు. శ్రావణ్ భార్య రైల్వేలోని సిఆర్ఎస్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం తూకివాకం చెరువు వద్ద శ్రావణ్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని.. వివరాలు సూకరిస్తున్నామని తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ మేరిగ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కలిశారు. అనంతరం శాంతి భద్రతలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మురళీధర్‌కు అభినందనలు తెలిపారు.

'ప్రగతి' సేవలు అభినందనీయం




ప్రజాశక్తి-రేణిగుంట: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రగతి సంస్థ చేస్తున్న సేవలు అమోఘమని రేణిగుంట ఎంపీడీవో హరిబాబు అన్నారు. శుక్రవారం ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బాలికల పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రగతి సంస్థ విద్యాభివద్ధికి చేస్తున్న కషిని కొనియాడారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఇన్‌కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మండలాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో పదో తరగతి పరీక్షలతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు కళాశాల విద్యకు ఉపయోగపడేలా బ్యాగు, పుస్తకాలు, స్టేషనరీ అందించారు. సమావేశంలో కందాడు, బందార్లపల్లి ప్రధాన ఉపాధ్యాయులు రెడ్డయ్య, రమణ, ఉపాధ్యాయులు శుభశ్రీ, మురళి, ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలకు మరమ్మతులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని 12వ వార్డు అమరంకండ్రిగలో ప్రజల కోరిక మేరకు మురుగునీటి కాలువ పనులు చేపడుతున్నారు. పురపాలక సంఘం సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షలతో పనులు ప్రారంభించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి పనులను పరిశీలించారు.కౌన్సిలర్ బాలాజీ, అధికారులు పాల్గొన్నారు.

నరసింహస్వామి అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం ఉదయం స్వామివారు నరసింహస్వామి అలంకరణలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ వాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

వాలంటీర్లు ప్రజా సమస్యపై దృష్టి సారించాలి



ప్రజాశక్తి-వెంకటగిరి: ఆయా సచివాలయ పరిధిలోని వాలంటీర్లు రోజూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కమిషనర్ వెంకటరామయ్య సూచించారు. శుక్రవారం ఒకటి, రెండు వార్డుల సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని వాలంటీర్లు సమస్యలను గుర్తించి సోమ, బుధ, శుక్రవారాల్లో సచివాలయంలో తెలియజేయాలని కమిషనర్ కోరారు. సమస్యలను సకాలంలో పరిష్కరించి ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. రోజూ గంటపాటు సమస్యలపై తిరగాలని.. సమస్యల రహిత వెంకటగిరిగా చూడాలని సూచించారు. సమావేశంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: స్థానిక అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఉయ్ సపోర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు తహసున్నిసా బేగం విద్యార్థులకు యోగాలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలన్నారు. ఏకాగ్రత, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈనెల 10వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జె.శివ ప్రసాద్, జీవన్, మునీంద్ర, గోవిందు, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతలో నైపుణ్యాలను పెంచడానికి వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను పెంచడానికి ఆం.ప్ర. నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం ఆం.ప్ర. స్కిల్ డెవలప్మెంట్ సంస్థ పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను ఏర్పాటు చేసింది. రాష్ట్ర సాంస్కృతికశాఖ మంత్రి ఆర్.కె. రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్కిల్ డెవలప్‌మెంట్ తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మన దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదన్నారు. సుమారు 15 బహుళజాతి కంపెనీలు నిర్వహించిన మేళాలో 296 మంది అభ్యర్థులు పాల్గొనగా వారిలో 193 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల స్కిల్ కోఆర్డినేటర్ నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ తులసి, గుణశేఖర్ రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరు పద్మజ, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, వైస్ ఛైర్మన్లు శంకర్, జయప్రకాష్, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ వైస్ ప్రిన్సిపల్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అప్లాయిగుంటలోని శ్రీకరి మాణిక్యస్వామి ఆలయంలో జరిగిన గరుడ సేవలో పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 40 మంది పాల్గొని భక్తులకు విశిష్ట సేవలను అందించినట్లు స్కౌట్స్ మాస్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనానికి ఇరువైపులా భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తూ.. భక్తులకు పానియాలు అందిస్తూ విశిష్ట సేవలను అందించారని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ఈవో, సూపరింటెండెంట్, ఓం శక్తి గుడి అధినేత జ్యోతినాయుడు ప్రత్యేకంగా విద్యార్థుల సేవలను అభినందించారు.

ఆత్మీయ సమ్మేళనం



ప్రజాశక్తి-కోట: కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ మోడల్ హైస్కూల్లో 1994-1995లో పదో తరగతి చదివిన వారందరూ శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని హిల్ వ్యూ రెస్టారెంట్‌లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-ఓజిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కిందని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచవరం సచివాలయ పరిధిలో కుందాం గ్రామ సర్పంచి ఎద్దల కనకదుర్గ రమణి , తిరుమలపూడి గ్రామ సర్పంచి యాకసిరి గోపాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి చేరువ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్ర రాజు, ఏఎంసీ డైరెక్టర్ పాకనాటి ప్రవీణ, పిఎసిఎస్ అధ్యక్షులు ఎద్దల.రాజారాం రెడ్డి , ఈశ్వర్‌రాజు, రామచంద్రరాజు, రాములనాయుడు, నరేంద్ర, యాకసిరి చంద్ర, వైసీపీ నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- జేఈవో సదా భార్గవి



ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రంలో విపత్తులు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కోవడానికి ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని జేఈవో సదా భార్గవి టీటీడీ అధికారులను ఆదేశించారు. టీటీడీలో విపత్తులను ఎదుర్కొనే అంశంపై రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ, యూనిసెఫ్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులకు శ్వేతలో మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ముగింపు సభలో జేఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదా భార్గవి మాట్లాడుతూ టీటీడీలో ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశాలున్న ప్రాంతాలను ముందే గుర్తించాలని చెప్పారు. భక్తులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా వీటిని వేగంగా, సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవచ్చో విపత్తుల నిర్వహణ శాఖ, యూనిసెఫ్ ప్రతినిధులు పరిశీలిస్తారని చెప్పారు. టీటీడీ లోని అన్ని విభాగాల అధికారులు వీరికి పూర్తిగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ ఈడి డాక్టర్ నాగరాజు, యూనిసెఫ్ ప్రతినిధి అమల్ కష్ణ, ఎస్ఈ 2 జగదీశ్వర రెడ్డి, రవాణా విభాగం జిఎం శేషారెడ్డి, జిఎం ఐటి సందీప్, అన్నదానం డెప్యూటీ ఈవో రాజేంద్ర, ఈఈ లు జగన్మోహన్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, రవిశంకర్ రెడ్డి, శ్రీహరి, శ్వేత సంచాలకులు ప్రశాంతి, ఆరోగ్య,అటవీ, పోటు, విజిలెన్స్, వివిధ ఆలయాల అధికారులు, ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ బీసీ సంక్షేమ సంఘ సభ్యులకు అభినందనలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నూతనంగా ఏర్పడిన టిటిడి బీసీ సంక్షేమ సంఘం సభ్యులు టిటిడి ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. టిటిడి జేఈ వీరబ్రహ్మం, లా అధికారి వీర్రాజు, అదనపు ముఖ్య నిఘా భద్రతాధికారి శివకుమార్ రెడ్డి, చీఫ్ ఆడిట్ అధికారి శేషశైలేంద్ర, బోర్డు సెల్ డిప్యూటీ ఈవో కస్తూరిబాయ్, డిప్యూటీ డీఎల్ఓ శ్యామ్ సుందర్ రెడ్డి, అసిస్టెంట్ లా అధికారి యుగంధర్ రెడ్డి, అన్నదానం డిప్యూటీ ఈఓ సుబ్రహ్మణ్యం, ఏఈఓ సర్వీసెస్ మాధవి, టిటిడి పీఆర్ఓ రవి లను కలిశారు. అధికారుల ఆదరాభిమానాలను అభినందనల రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు శైలేంద్ర, అధ్యక్షులు రవీంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, కోశాధికారి కామరాజు, అదనపు ప్రధాన కార్యదర్శి దేశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ యువరాజు, వైస్ ప్రెసిడెంట్ అనురాధ, జాయింట్ సెక్రటరీ అరుణ్ కుమార్, సాయి కుమార్, రామారావు, హేమ్ కుమార్, లావణ్య, కళావతి, రాఘవేంద్ర బాబు పాల్గొన్నారు.

ఆస్తిపన్నులు సకాలంలో వసూలు చేయాలి



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని యూజర్ ఛార్జీలు, ఆస్తిపన్నులు సకాలంలో వసూలు చేయాల్సిందేనని శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులను ఉద్దేశించి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి నగరంలో అన్ని సచివాలయాల్లోని శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులతో యూజర్ ఛార్జీలు, ఆస్తిపన్ను వసూళ్లపై ఎస్వీ యూనివర్శిటీ సెనేట్ హాల్లో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిమాండ్ మేరకు యూజర్ ఛార్జీలు, ఆస్తి పన్నులు వసూళ్లు చేయాల్సిందేనని, యూజర్ ఛార్జీలు తక్కువ స్థాయిలో వసూళ్లు చేసిన శానిటరీ కార్యదర్శులతోపాటు ఆ డివిజన్ అడ్మిన్లతో ప్రత్యేకంగా కమిషనర్ మాట్లాడారు. ఇంటింటికీ చెత్త సేకరి స్తున్నామని.. ప్రతి వీధిలోకి చెత్త సేకరణ ఆటోలు వస్తున్నాయని.. మరెందుకు యూజర్ ఛార్జీలు సకాలంలో సక్రమంగా వసూలు చేయలేదని ప్రశ్నించారు. వాలంటీర్లు సహకరించడం లేదని కొంతమంది తెలుపగా.. పని చేయని వాలంటీర్లను తొలగించమని రాత పూర్వకంగా ఇస్తే తొలగిస్తామని, పని చేసే వాలంటీర్లను పెట్టుకుందామని చెప్పారు. పని చేయకుండా వాలంటీర్లపై చెబితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న షాపులపై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాలన్నారు. అంతేకాకుండా చెత్తను బయట పడేసే వారిని గుర్తించి జరి మానాలు వేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, సుపర్డెంట్ పి.రవి, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచెయ్య, సుమతి, ఆర్.ఐలు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.